క్లుప్తంగా

అంతుచూస్తానని మహిళకు బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్) : తనపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, లేకుంటే అంతు చూస్తానని మహిళను బెదిరించిన ఘటనలో నిందితుడిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మూలాపేటకు చెందిన సంధ్యా, అనిల్‌కుమార్ దంపతులు. వారు తమ ఇంటి పత్రాలను తాకట్టుపెట్టగా వచ్చిన నగదును స్నేహితుడు శ్రీధర్‌కు అప్పుగా ఇచ్చారు. అయితే అప్పు తాలుకు నగదు చెల్లించకుండా శ్రీధర్ కాలయాపన చేస్తుండటంతో ఇటీవల అతడిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సంధ్యా పనినిమిత్తం జిల్లా కోర్టు వద్దకు వెళ్లగా శ్రీధర్ అడ్డుకున్నారు. తనపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో అంతుచూస్తామని, భూమిమీద లేకుండా చేస్తానని ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

నెల్లూరు సిటీ : బుజబుజ నెల్లూరులోని చిల్డ్రన్స్ హోమ్‌లో అనాథ పిల్లలకు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పల్లిపాడుకు చెందిన దాసరి రమ్య జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రమేష్, అధ్యక్షుడు ముని వెంకటసూర్య, సభ్యులు సురేష్, బాలాజీ, రాజా, సాయి, ధనలక్ష్మి, షఫీ తదితరులు పాల్గొన్నారు

ఏఐతో ఎన్నో ఉపయోగాలు

నెల్లూరు (టౌన్) : భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ తెలిపారు. స్థానిక వీఆర్సీ సెంటర్‌లోని రావూస్ డిగ్రీ కళాశాలలో ఏఐ టెక్నాలజీపై వివిధ కళాశాలల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఏఐని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం ఇంతియాజ్‌ను సత్కరించారు. కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్ శివసాకేత్, సీఈఓ శివారెడ్డి, ప్రిన్సిపల్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి బొట్టు.. ఒడిసిపట్టు

నెల్లూరు (టౌన్) : ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ నిర్వహించారు. వ్యవసాయం, పరిశ్రమలు, వినోదం, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ కోసం నీటి వనరులు అమూల్యమైనని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకుందామని అందరు ప్రతిజ్ఞ చేశారు.

సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన తలారి బాలసుధాకర్‌ను కార్పొరేషన్ (ఎన్ఎంసీ) వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మురళీకృష్ణంరాజు, ఏసునాయుడు, శ్రీధర్, వెంకటరమణ, రఘునాథ్, బాబ్జి, బాలచెన్నయ్య, శాంతికుమార్, సతీష్, రసూల్, సుభాష్‌చంద్రబోష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : తిరుపతిలో మే 15 నుంచి జరుగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా పిలుపునిచ్చారు. స్థానిక జనార్దనరెడ్డి కాలనీలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో మహాసభల లోగోను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటు మహాసభలు జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ నగరాధ్యక్షుడు గౌస్‌బాషా, సర్దార్, బాదుల్లా, రియాజ్, గౌస్‌బాషా, బబయ్య పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన నేడు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా నగరంలో ఆదివారం కాగడాల ప్రదర్శన జరుగుతుందని డీవైఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు రమణ, నరసింహులు తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో వారు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు నగరంలోని సుందరయ్య బొమ్మ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు కాగడాల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజలు తరలిరావాలని కోరారు. డీవైఎఫ్ఐ నాయకులు తిరుపతి, జగదీష్, సాయిగణేష్, శీను, నందకిషోర్, శ్రీహరి, జీవన్,విక్రమ్ తదితరులు, పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయంలో శిక్షణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో ఆత్మకూరు మండల న్యాయవాదుల పరస్పర సహకార సహాయక గృహ నిర్మాణ సంఘ సభ్యులకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప పలు సూచనలు చేశారు. న్యాయవాదులు ఏర్పాటు చేసిన సహకార సంఘం జిల్లాలో మొదటిది కావడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ న్యాయవాదులు మహాదేవరెడ్డి, ఎల్వీ రమణయ్య పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. మురుగు పారేదెలా?

చెత్తతో నిండిన కాలువలు
- దుర్వాసనతో ప్రజల బెంబేలు
- చెత్త, మురుగు తొలగించాలని వినతి



మైపాడుగేట్, మారుతీనగర్ మొదటి వీధిలో కదలని మురుగు



రంగనాయకులపేట, ఇసుకడొంక వీధిలో సైడు కాలువ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. సైడు కాలువల్లో మురుగునీరు ముందుకు పారడం లేదు. చెత్త చెదారం, పూడికతో సైడు కాలువలు పూడుకుపోయి మురుగునీరు పారుదల స్తంభించిపోతోందని స్థానికులు వాపోతున్నారు.

నగరంలో..

నగరంలోని రంగనాయకులపేట, ఇసుకడొంక, మైపాడుగేట్, మారుతీనగర్ మొదటి వీధి ప్రాంతంలో సైడు కాలువల నిర్వహణ సక్రమంగా ఉండడం లేదు. ఇక్కడ ఇంట్లోని వ్యర్థ నీటితో పాటు ఇతర వ్యర్థాలను కూడా కాలువల్లో వదిలేయడంతో మురుగునీరు ముందుకు పారడం కష్టంగా మారింది. మురుగుతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యా లాంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కాలువల్లో పూడికతీయాలి

దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు నామమాత్రంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం, పూడికను పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించడం లేదని ఆరోపిస్తున్నారు. సైడు కాలువలు నిండి మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోందని, సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే ఈ వీధుల్లో సైడు కాలువలు చెత్తతో పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. దాని నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సైడు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను తొలగించాలని కోరుతున్నారు.

మురుగు పారడం లేదు



సైడు కాలువలు పూడికతో నిండి మురుగు నీరు ముందుకు పారడం లేదు. రోజుల తరబడి అలానే ఇళ్ల ముందు నిలిచిపోతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నాం. కాలువల్లో పూడిక తీసి మురుగు పారేలా చర్యలు తీసుకోవాలి.

– షాజహాన్, న్యూకాలనీ

వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

నెల్లూరు(అర్బన్) : జిల్లాలోని అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా, గ్రేడ్-2 రెవెన్యూ అధికారులకు గ్రేడ్-1 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని జేసీ కార్తీక్‌కు ఆ సంఘ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాలతో సంబంధం లేకుండా రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం, క్లస్టర్‌కు ఒకే వీఆర్వోని నియమించడం వల్ల తమపై పనిభారం పెరిగిందని వివరించారు. క్లస్టర్ వల్ల కలిగే ఇబ్బందులను కలెక్టర్ల సదస్సులో వివరించాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణయ్య, నాయకులు నాగేశ్వరరావు, తిరుమలరాజు, రాజేశ్వరి, మునిబాబు, రవిశేఖర్, చిరంజీవి, నాగరాజు, రవీంద్రరెడ్డి, శరవణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



నెల్లూరు సిటీ : తల్లిదండ్రుల పట్ల పిల్లలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా రైల్వే జడ్జి వినోద్ అన్నారు. నారాయణరెడ్డిపేటలోని బాపూజీ వృద్ధుల ఆశ్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో కుటుంబసభ్యులను నిర్లక్ష్యం చేస్తే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. సూళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్, కావలి జూనియర్ సివిల్ జడ్జి విక్రమసింహ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పార్టీ సిటీ, రూరల్ ఇన్‌చార్జిలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

వలంటీర్లకు కూటమి దగా

నెల్లూరు (పొగతోట) : గ్రామ, వార్డు వలంటీర్లను సీఎం చంద్రబాబు మోసం చేశారని వలంటీర్ల రాష్ట్ర అధ్యక్షుడు హుమయూన్ బాషా శనివారం తెలిపారు. ఉగాది రోజున కూటమి దగా కోరు పాలనకు నిరసన తెలుపుతామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శనివారం మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన షేక్ ఫాజిల్(44)కు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కరిష్మాతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహానంతరం ఫాజిల్‌లో బుచ్చిలోనే ఉంటున్నారు. కొద్దిరోజుల కిందట ఆయన ఇంట్లో గొడవపడి బాలాజీనగర్‌లోని తన తల్లి ఇంటికి వచ్చారు. ఈక్రమంలో ఈనెల 19న ఫాజిల్ కనిపించడం లేదని భార్య బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు అతనికి ఫోన్‌చేసి ఈనెల 20న పోలీసుస్టేషన్‌కు రావాలని చెప్పారు. అయితే ఫాజిల్ పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా నగరంలో తిరుగుతూ తాను చనిపోతానని ఫోన్‌లో కుటుంబ సభ్యులు, బంధువులకు మెసేజ్‌లు పంపాడు. గతంలోనూ పలుమార్లు ఇదే తరహాలో ఆయన వ్యవహరించడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆయన కోటమిట్టలోని మీరా మొహిద్దీన్ దర్గా సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని అతని స్నేహితుడు గుర్తించి ఫాజిల్ అన్న షాజాకు తెలియజేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని తమ్ముడిని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నారాయణకు తీసుకెళ్లారు. అక్కడ కూడా అదే విషయాన్ని తెలియజేయడంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు మృతుని అన్న షాజా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరి ఇష్టం వారిది



డీఆర్‌డీఏ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- సమయపాలన పాటించని డీఆర్‌డీఏ ఉద్యోగులు

నెల్లూరు (పొగతోట) : డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. శనివారం ఉదయం 11 గంటలు దాటినా 90 శాతం మంది ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి విధులకు హాజరైన అరగంట తర్వాత సిబ్బంది తీరిగ్గా ఒక్కొక్కరుగా కార్యాలయానికి చేరుకున్నారు. పీడీ ఉంటే ఒకలా, లేకుంటే ఉద్యోగుల తీరు మరోలా ఉంది. ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కిమ్స్‌లో లివర్ డయాలసిస్ చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

నెల్లూరు(అర్బన్) : లివర్ మొత్తం పాడైపోయి అపస్మారక స్థితిలో తమ ఆస్పత్రికి వచ్చిన ఓ యువకుడికి లివర్ డయాలసిస్(ప్లాస్మా ఎక్స్చేంజ్) అనే అరుదైన చికిత్స అందించి ప్రాణాలను కాపాడినట్లు కిమ్స్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం కిమ్స్ ఆస్పత్రిలో ఆయన వెల్లడించారు. కావలికి చెందిన 22 ఏళ్ల పొట్టయ్య అనే యువకుడు ఎలుకల మందు తిని లివర్ పాడైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లివర్ మార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో నాలుగు దఫాలు శరీరంలోని ప్లాస్మాను తీసేసి మళ్లీ ప్లాస్మాను ఎక్కించామన్నారు. దీంతో అతనికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రమాదం తప్పిందన్నారు. తక్కువ ఖర్చుతోనే క్రమంగా కోలుకున్నాడన్నారు. ఈ చికిత్సలో భాగస్వాములైన సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ జానకిరామ్, నెఫ్రాలజిస్ట్ సన్నేష్‌రెడ్డి, జగదీష్, ఉదయశంకర్‌రెడ్డిలను ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, మెడికల్ కో-ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

నెల్లూరురూరల్ : ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15 లక్షల మందికి తాగునీటిని అందించే వెలిగొండ ప్రాజెక్ట్, సోమశిల హైలెవల్ కెనాల్‌లకు అవసరమైన నిధులు కేటాయించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, నాగలక్ష్మి, పద్మావతి, ఆదినారాయణ, నాగేంద్ర సింగ్, వెంకటసుబ్బయ్య, నారాయణ, కళ్ల భాస్కర్, నీలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



నెల్లూరు(అర్బన్) : మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలకు స్పెషల్ క్యాజువల్ సెలవులు మంజూరు చేసినందుకు కలెక్టర్ ఆనంద్‌ను ఎన్‌జీఓ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కలెక్టరేట్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో శనివారం దేవుని ప్రతిమను అందజేసి సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ఆంజనేయవర్మ, కరుణమ్మ, సువర్ణ, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, జిల్లా మహిళా చైర్‌పర్సన్ చిన్నమ్మ, కన్వీనర్ నవోదయ, రామకృష్ణ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : 'విద్యుత్ భారాలు–ప్రజలపై ప్రభావం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నగరంలోని బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీల విషయంలో కూటమి ప్రభుత్వం వైఖరి తగదన్నారు. సీపీఎం, రైతు సంఘం నాయకులు రెహానాబేగం, వెంగయ్య,మంగళ పుల్లయ్య, గోగుల శ్రీనివాసులు, ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నెల్లూరు(బారకాసు) : రంగనాయకులపేటలో వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా 300 మంది మహిళలకు రంజాన్ తోఫా, చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని చేపట్టిన 52వ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్ బాషాను ఆయన అభినందించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పేర్నెటి కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విక్రయాలు వేగవంతం

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట) : స్వయం సహాయక గ్రూపు మహిళలు తయారు చేసిన వస్తువులను ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అధికారులను ఆదేశించారు. నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి మండల సిబ్బందితో శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఆన్‌లైన్ డెలివరీలు వేగవంతం చేయాలన్నారు. పొదుపు మహిళలకు సంబంధించి రుణాల రికవరీలను వందశాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రికవరీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సక్రమంగా పనిచేసేలా చూడాలని వినతి

నెల్లూరు (పొగతోట) : రేషన్ పంపిణీకి సంబంధించి ఎండీయూ ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారు సకాలంలో సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలువాయి మండల చౌకదుకాణం డీలర్లు కోరారు. ఆ మేరకు శనివారం డీఎస్‌ఓ అంకయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఎండీయూ ఆపరేటర్లు సక్రమంగా హాజరుకాకపోవడంతో రేషన్ పంపిణీలో జాప్యం జరుగుతోందన్నారు. రేషన్ పంపిణీకి సంబంధించి వివరాలను అందజేయడంలో, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరి, రాజగోపాల్ పాల్గొన్నారు

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో అధికారులు

నెల్లూరు (టౌన్) : విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాద్ధంగా ముందుకెళ్లినప్పుడు విజయం సాధ్యమని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి పి.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మలబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో చదువుతున్న 93 మంది విద్యార్థినులకు రూ.8.08 లక్షల స్కాలర్‌షిప్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బాలికల చదువు, మహిళల సాధికారతకు ఇలాంటి సహాయాన్ని అందజేస్తున్న మలబార్ సంస్థను ఆమె అభినందించారు. ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతూ 2022లో 149 మంది విద్యార్థులకు రూ.13.40 లక్షలు, 2024లో 58 మంది విద్యార్థులకు రూ.5.12 లక్షలను స్కాలర్‌షిప్‌గా అందజేసిన మలబార్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ సాహిల్, అసిస్టెంట్ స్టోర్ హెడ్ అమ్మాల్, గెస్ట్ రిలేషన్ మేనేజర్ తివారి, మార్కెటింగ్ మేనేజర్ గోకుల్, డీవీఈఓ మధుబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, విశ్రాంత అధ్యాపకురాలు కుసుమకుమారి పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. రాత్రి చెన్నైకి చెందిన అభిషేక్ రఘురామ్ గాత్ర కచేరి రసరంజకంగా సాగింది. వీవీ శ్రీనివాసరావు(వయొలిన్), కిశోర్‌రమేష్(మృదంగం), హెచ్.ప్రసన్న (ఘటం) వాద్య సహకారమందించారు. ఎనమండ్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

నెల్లూరు సిటీ : నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను తయారు చేస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని నవాబుపేట, నజీర్‌తోట ఎఫ్‌సీఐ కాలనీ వద్ద నాలుగు పార్కులను, నవాబుపేట చిన్నబాలయ్య నగర్ మున్సిపల్ హైస్కూల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఏప్రిల్ మొదటి వారంలోగా నగరంలోని అన్ని పార్కుల్లో అభివృద్ధి పనులు పూర్తవుతాయన్నారు. అన్ని మున్సిపల్ పాఠశాలల్లో క్రీడా పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వేసవి దృష్ట్యా త్వరలో నగరంలో ఆరు ఏసీ బస్టాండ్లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ పెండింగ్ పనులు, తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరలోనే నిధులు మంజూరవుతాయని తెలియజేశారు.

వీఆర్ హైస్కూల్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా

నెల్లూరు (టౌన్) : వీఆర్ హైస్కూల్‌ను దేశంలోనే మోడల్ హైస్కూల్‌గా తీర్చిదిద్దనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయన వీఆర్ హైస్కూల్ రెన్నోవేషన్ పనులను శనివారం పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

కీటకజనిత వ్యాధుల నివారణకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్) : కీటకజనిత వ్యాధులను నివారించేందుకు ఆరోగ్య సహాయకులు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత సూచించారు. నగరంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య సహాయకులకు కీటకజనిత వ్యాధులపై శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సహాయకులు మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా, ఫైలేరియా లాంటి వ్యాధులతో పాటు ఇతర జబ్బులను నివారించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి ఎం.హుస్సేనమ్మ, సహాయ అధికారి నాగార్జునరావు పాల్గొన్నారు.

నషా ముక్త భారత్‌పై శిక్షణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నషా ముక్త భారత్ అనే అంశంపై వలంటీర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నగరంలోని బట్వాడిపాళెంలోని ఓ ఫంక్షన్‌హాల్లో జిల్లా అధికారులు పాల్గొని, పలు సూచనలు చేశారు.

సింహపురి వైభవంపై సభ

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో 'సింహపురి చారిత్రక వైభవం' అనే అంశంపై శనివారం రాత్రి సభ జరిగింది. విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, తెలుగుభాషోద్యమ నేత చెలంచర్లభాస్కరరెడ్డి, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, నిర్వాహకులు వై.శేషగిరీశం, ఎం.సుబ్రహ్మణ్యం, సభ్యులు విశ్వనాథం, గట్టుపల్లి ఆదిశేషు, సుబ్బరాయుడు, బుజ్జయ్య పాల్గొన్నారు.

29వ వార్షికోత్సవం
ఉచిత వైద్య శిబిరం
దీప్తి నర్సింగ్ హోమ్
బృందావనం, నెల్లూరు, సెల్ : 2320802
తేది : 23-03-2025 ఆదివారం
సమయం :
ఉ 9.00 గంటల నుండి మ 1.00 గంటల వరకు
డా. సుమతి
MBBS., DGO.,
స్త్రీల కాన్పులు గర్భకోశ వ్యాధి నిపుణులు
డా॥ లోకనాథం
M.S., (Gen & Vascular Laproscopic Surgeon)
FAIS, UK (Rtn)
జనరల్ వ్యాస్కులర్ సర్జన్
పిత్తాశయంలో రాళ్లు, థైరాయిడ్, రొమ్ము క్యాన్సర్, జీర్ణాశయం క్యాన్సర్లు మరియు మొలలకు పరీక్షలు చేయబడును. గర్భిణీ స్త్రీలకు ఉచితంగా రక్తం, మూత్ర పరీక్షలు నిర్వహించబడును. ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు ఇవ్వబడును.

